5113

# పెళ్ళి ప్రయాణం ★

"ప్రియ మిత్రుడు శేఖరానికి—

దాసుడు సూర్యం చేయు విన్నపములు ఏమనగా, మా నాన్న, అమ్మ, బంధువులు, స్నేహితులు అంతా మూకుమ్మడిగా కలిసి యీ నెల పధ్నాలుగవ తారీఖు శుక్రవారం నా పెళ్ళిచేయ నిశ్చయించుకున్నారు. మన మిత్రబృందం చేసిన చట్టంలో నాల్గవ క్లాజు ప్రకారం నేను అందరికీ (అంటే రాజు రాడు, చంద్రిగాడు వగైరాలకు పదిరోజులుముందుగానే తెలియ పరుస్తూ, నీకుగూడా యీ వుత్తరం రాస్తున్నాను. కావున తాము సకుటుంబ బంధుమిత్ర సపరివారంగా వివాహమునకు విచ్చేయ ప్రార్థన.

ఆఫీసరు సెలవు యివ్వలేదని యేడుపు మొహం పెట్టక తప్పకుండా రా! లేకపోతే నా పక్కన సమాధానం చెప్పే వాళ్ళుండరు. వంటరివాడి నయిపోతాను. పెళ్ళికూతురికి పాతిక మంది పైగా ప్రాణస్నేహితులున్నారని, వారి ప్రభావం చాలా చాలా వుంటుందని పారాహుషారంటూ వార్తలు వచ్చాయి. అన్నట్లు ప్రసాదరావు నీకు తెలుసుగా! బాగా పరిచయం లేక పోయినా కొంచెంగానైనా గుర్తుండి వుంటాడు. వాడి పిన

తండ్రి కూతురే! మరి యెప్పుడొస్తావో! నీమీద ప్రాణాలు నిలుపుకుని వున్నాను.

ఇట్లు,
పరాయివాడు కాబో
తున్న నీవాడు—
నీ సూర్యం"

ప్రాణమిత్రుడు పరిణయం ఆడబోతున్నాడంటే శేఖరానికి సంతోషంతోపాటు విచారంగూడా ముంచుకొచ్చింది. సరిగ్గా యిన్స్పెక్షన్ రోజులు! ఒకరోజా, రెండు రోజులా? పదిరోజులు! ప్రాణం పోతోందన్నా సెలవు యివ్వరు. సెలవు అంటూ పెడ్తే వింటూనే మండిపడతాడు ఆయన! అసలు పేరే హనుమంతరావు. ఏం చెయ్యటం? సరిగ్గా వీడి పెళ్ళి గూడా యిప్పుడే రావాలి? పోనీ ఏ ప్రాణంపోయే జబ్బో వచ్చిందని వంకపెడితే? అబ్బే! డాక్టర్ని తీసుకుని యింటికి రాడూ? దొరక్క—దొరక్క— దొరికిన వుద్యోగం! అనుకోకుండా వచ్చింది. అందరూ అదృష్టవంతుడివి అంటూ ఎట్లా పొగిడారు! అయినా తను పాతవాడుకూడా గాదయ్యె, చేరి ఆరునెలలు నిండాయి. అంతేగా! మరేం చెయ్యటం? రెండు చేతులూ జుట్టులోకి పోనిచ్చుకుని ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు శేఖరం. రాజు యెవరితో చెప్పా పెట్టాకుండా వాళ్ళనాన్న కిష్టంలేక అమ్మాయిని రహస్యంగా రిజిష్టర్ మ్యారేజ్ చేసుకున్నాడు. చంద్రం పెళ్ళి పోట్లాటల్తో, కొట్లాటల్తో అసలు ఆవూరునుంచి బయటపడితే చాలురా భగవంతుడాఅన్నట్లు అంతంత మాత్రంగా అయింది. ప్రభాకరం పెళ్ళి

వాళ్ళ బొమ్మ చచ్చిపోతోంది అంటే ఆదరా బాదరా అయింది. ఇహ యెటొచ్చీ సూర్యం పెళ్ళేగా కాస్త నిదానంగా అవుతోంది! సూర్యం పెళ్ళిగూడా అతేయి యిహ తను మిగుల్తాడు. అయినా తన పెళ్ళికి తనకేం సరదా వుంటుంది? ఉన్నా, ఆ సరదా వేరు. ప్రతిసారీ అంతా కలిసి, యెంతో సరదాగా పెళ్ళికొడుకు స్నేహితులం అంటూ ఎంతో హడావుడి చేయాలని, తను చిలిపి చేష్టలతో ఆడపెళ్ళివారిని అట్టుడికించినట్లు వుడికించాలని యెన్నో ప్లానులు వేసుకోవటం, అవి మొదట్లోనే బెడిసికొట్టడం జరిగిపోతోంది. ఈసారి అలాగమేల్లా సూచనలు కన్పించటం లేదని సంతోషిస్తుంటే, మధ్య తనకీ బెడద ఏమిటి? ప్రభాకరం లెక్చరర్. కావలసినన్ని సెలవులు! చంద్రం ఆఫీసరు యెంతో మంచివాడు. ఇహ రాజు సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆ కంపెనీకి వాడే మేనేజరు. అందరికీ బాగానే వుంది. అంతా ముందొస్తారు. ఈ తిప్పలన్నీ తనకే! ఏమయినా సరే, అడగాలి! వెధవ వుద్యోగం పోతే పోతుంది. ఇలాటివి సవాలక్ష! కానీ సూర్యం పెళ్ళి జీవితంలో ఒకసారేగా వచ్చేది! దృఢనిశ్చయం చేసుకున్నాడు శేఖరం.

మర్నాడు ఆఫీసులో ఆరుగంటలు దాటినా, అంతా వెళ్ళిపోయినా, ఏవో కాగితాలు చూస్తున్న నెపంతో ఉండిపోయాడు శేఖరం. అంతా పూర్తిగా వెళ్ళిపోయారని తెలుసుకున్న తర్వాత, కాగితాలు డ్రాయరు సొరుగులోకి తోసి లేచి నిలబడ్డాడు. కాలర్ సవరించుకుని ఆయనముందు ఎలా నిలబడాలో, ఏ విధంగా తను వచ్చినపని చెప్పాలో యిన్స్పెక్షన్ రోజుల్లో సెలవేమిటయ్యా అని తిట్టూంటే సహించి, మొహాం

ఎంత ప్రశాంతంగా పెట్టాలో, అన్నీ మళ్ళీ ఒకసారి సీరియల్ వారీగా రిహార్సల్ చేసుకుని నెమ్మదిగా ఆఫీసరుగారి గది తలుపుతోశాడు. 'శివశివా! ఈ మంజులతాదేవి గూడా ఇక్కడేవుండాలి! అడుగులోనే హంసపాదా!' అయినా అడుగు ముందుకు వేసింతర్వాత వెనక్కు తీయడం తనబోటి ధీరులకు తగదు. ఠీవిగానే లోపలకు నడిచాడు శేఖరం. సాయంత్రం పూట అప్పుడప్పుడు అటువైపుగా షికారుకువస్తూ, వచ్చినప్పుడు కాసేపు తండ్రిదగ్గర కూర్చుని పోవడం మంజులతకి అలవాటు. ఆవిడ గదిలోంచి వెళ్ళిపోగూడదూ అనుకున్నాడు శేఖరం. ఆవిడ వుండగా చెప్పడానికి ఏం భయంలేదుగానీ, తను చెప్పిందివిని ఆయన మండిపడి మొహం వాచేట్లు తిట్టూంటే, ఆవిడ పక్కకు తిరిగి ముసిముసి నవ్వులు నవ్వుకుంటుందేమో! పోనీ వుండటమే మంచదేమో! ఎంతయినా ఆడపిల్ల ముందు ఆయన తిట్టాడా? కానీ చూద్దాం– చెప్పటాని కుపక్రమిస్తున్నట్లుగా శేఖరం గొంతు సవరించుకున్నాడు. ముఖ్యమైన కాగితాల్లో మునిగి తేలుతున్న హనుమంతరావు కళ్ళు సగం మటుకే యెత్తి గుర్తుపట్టానన్నట్లు తలాడించి మళ్ళా దించేసుకున్నారు. వచ్చినవాడు మెదలకుండా వూరుకోవటం చూచి,

"ఏమిటోయ్?" అన్నారు.

ఉలిక్కిపడ్డ శేఖరం మరోసారి గట్టిగా గొంతు సవరించుకున్నాడు. వెధవది! సమయానికే వచ్చివెలక్కాయ అన్నట్లు జీరపోవాలా గొంతుక!

"నిన్నే!" త్వరగా చెప్పు నాకు చాలా పనుంది అన్నట్లుంది ఆయన స్వరం.

"మరండీ! యేంలేదు— అహాఁ, ఓ పది రోజులు సెలవు... పెళ్ళండీ! లేకపోతే అసలు అడగకనేపోదును—" ఎంతయినా అలా కన్నార్పకుండా చూసే అమ్మాయిల ముందు అందులో హనుమంతరావుగారి జోటి వారితో మాట్లాడటం— చాలా కష్టం, అనుకున్నాడు శేఖరం.

"పెళ్ళా! యెప్పుడోయ్? మాటమాత్రం చెప్పలేదేం! ఎప్పుడూ?"

చూస్తున్న కాగితాలు వదిలేసి ఆశ్చర్యంగా తలెత్తారు హనుమంతరావుగారు. శేఖరానికి యేం జవాబు చెప్పాలో తోచలేదు.

"మరి శుభలేఖలేవీ?" మళ్ళా పనిలోకి చూస్తూ అన్నారాయన.

'ఇదేమిటి! సెలవుపేరు వినగానే తిట్టిపోస్తాడు అనుకుంటే, శుభలేఖలు అంటాడెందుకూ? అయినా తన స్నేహితుడి పెళ్ళికి వీళ్ళకి శుభలేఖ లేమిటిమధ్య!' అయోమయంగా చూస్తున్నాడు.

"ఊఁ! అయితే గుట్టుచప్పుడు కాకుండా చేసుకుని వూరుకుందామనా? బలేవాడివి! ఇంతకీ పెళ్ళెప్పుడో చెప్పనేలేదు?"

నిలువుగుడ్లేసుకుని చూస్తున్న శేఖరం కొంచెంగా తెప్పరిల్లి "పెళ్ళాండి, పధ్నాల్గవ తారీఖు!" అన్నాడు.

"అయితే పదిరోజులు సెలవు కావాలంటావు. ఇన్‌స్పెక్షన్ రోజులుగదా! ఇప్పుడేం పెళ్ళోయ్? సెలవు యివ్వనంటాననుకో— అప్పుడు నన్నందరూ ఎంత తిట్టారు? 'చూడు

కరోర్కోటకుడు! పెళ్ళి చేసుకుంటున్నాను అంటే సెలవు యివ్వ లేదు' అంటారు. అయినా ఎంత నీ పెళ్ళి అయితే మాత్రం పదిరోజులెందుకూ?"

"అదేమిటి సార్! పెళ్ళి..." నాది కాదని చెప్పబోతున్నాడు శేఖరం.

"అదేనయ్యా - పెళ్ళి నీదే! నాదికాదులే! కానీ పది రోజులెందుకూ అంటాను? ఆ వేళకు వెళ్తే సరిపోదూ? పెళ్ళి కొడుక్కి ఏమంత పనుందీ! ఆ మూడుముళ్ళు వేయడమేగా! యేమంటావు! అఁ మర్చిపోయాను? ఇంతకీ కట్నం ఎంత?"

"మంజూ! ఆ కూజాలో కాసిని మంచినీళ్ళు యిలా అందుకోమ్మా!" ఆయన తీరే అంత! కాగితాలు చూస్తూనే మాట్లాడేస్తారు. గంటల తరబడి ఆయనకు అభ్యాసం.

"నిన్నే, మాట్లాడవేం? ఎన్నివేలు?" త్రాగేసిన మంచినీళ్ళ గ్లాసు టేబిల్ మీద పెట్టూ అడిగారు.

"కట్నం యేం లేదండీ!" బుఱ్ఱగోక్కుంటూ జవాబు యిచ్చాడు శేఖరం.

"అదేం! లేకపోవడం యేమిటీ? ఇంత చదువుకున్న వాడివి, ఇంతమంచి వుద్యోగం చేసుకుంటూ, అన్నిటికీమించి ఆడవాళ్ళు అలా నిలబడిపోయిచూసే అందంగలవాడివి!"

అంతవరకూ రెప్పవేయకుండా శేఖరం మొహంలోకి చూస్తున్న మంజు గబుక్కున చూపు మరల్చుకుని కిటికీవైపుకి తిరిగింది.

"ఏం లేదండీ! నా కయితే తీసుకోవాలనే వుంది. కానీ..."

"కానీ...?"

"ఈమధ్య ఆ బిల్ పాసయింది కదండీ!" సిగ్గుపడు తున్నట్లు చెప్పాడు శేఖరం. బిగ్గరగా నవ్వేశారు హనుమంత రావుగారు. వచ్చే నవ్వు పైటకొంగులో దాచేసుకుంది మంజు లత.

"మరి ఆఫీసులో యింతవరకూ ఎవరికీ చెప్పలేదన్న మాట! చెప్పకపోతే ఎలాగూ? నువ్వు పదిరోజులు సెలవు కావాలంటున్నావు మరి? ఆ పనంతా వాళ్ళందరికీ పంచిచేయిం చాలి. నామాట విని శుభలేఖలు యివ్వకపోతే పోనీగాని వాళ్ళందరి మొహానా కాసిని కాఫీనీళ్ళుపోయించి మరీ వెళ్ళు. యేం, వినిపిస్తోందా? దానికి లోభిస్తేను వ్వసలు పెళ్ళిప్రయా ణమే మానుకోవాల్సి వస్తుంది."

శేఖరం హృదయం ఎగిరి గంతేసింది. అమాంతంగా ఒక్కసారి హనుమంతురావుగారిని గట్టిగా కావలించేసుకుందా మన్నంత ఆనందం కల్గింది. మర్నాడు సాయంత్రం తోటి వారంతా శేఖరం చూట్టూ యీగల్లా ముసిరారు.

"అదేమిటోయ్! మాట మాత్రం చెప్పలేదు." ఒకరు.

"పిలిస్తే పరుగెత్తుకొస్తామని భయపడ్డాడేమో!" మరొకరు.

"ఎంత వెఱ్ఱివాడివి! నువ్వు పిలిస్తే మటుకు రమ్మనమని మా ఎత్తుధనం పోస్తేమటుకు-మాకు సెలవు దొరుకుతుందా,

మేం వస్తామా? ఈ ఆఫీసులో, యీరోజుల్లో యిద్దరికే సెలవలు దొరికేది- ఒకటి పెళ్ళిచేసుకోబోతున్న నీలాటివాడికి, రెండు- పరమేశంలాగా యీ లోకంమీద విసిగి వైకుంఠయాత్ర కట్టిన వాళ్ళకి."

"అయినా-దాచుకుంటే యిదేమయినా దాగేది కను కనా? రేపు భార్యను తెచ్చుకుంటే యిల్లుకోసం అయినా చెప్పవూ? పిల్లలుపుడ్తే చెప్పవూ?"

"అయితే మన గురవయ్య హోటల్‌కి ఒక ఖాతా తగ్గి పోతోందన్న మాట!"

"ఇంతకీ పెళ్ళాన్నెప్పుడు తెచ్చుకుంటావు బాబూ?"

ఇలాటి ప్రశ్నలతో వుక్కిరిబిక్కిరి అయిన శేఖరానికి సమాధానాలు చెప్పలేక నానాఅవస్థా అయింది.

ఎంతలేదన్నా టీపార్టీ పేరుమీద పాతికకి పైచిలుకే వదిలాయి శేఖరానికి. ఏం చేస్తాడు? ఆపదసమయంలో ఆపద్బాంధవుడిలా దొరికినమార్గం! కాదంటే అసలు ప్రయాణమే మానుకోవాల్సి వస్తుంది. పోతే పోయింది వెధవడబ్బు. అవసరానికి కావాలని తీసుకుని ఎంతమంది యెగ్గొట్టలేదు? అందులో యిదొకటి- ముగ్గురు, నలుగురుమాత్రం వూరికేవస్తే బాగుండదనిఏవో తోచిన బహుమానాలు పట్టుకొచ్చారు,

"అబ్బే! యిప్పుడెందుకూ అవన్నీ? యీ రోజుల్లో పీటలమీద పెళ్ళిళ్ళు ఎన్నో తప్పిపోతున్నాయి. మూడు ముళ్ళలో రెండుముళ్ళుపడినా నమ్మకంలేదు. అతను భార్యా సమేతంగావచ్చి గృహప్రవేశం అవుతాడుగా! అప్పుడు

గాని..." అన్నాడో మాటకారి, వుప్మాచాలా బాగుంది అని మరోసారి పెట్టించుకుంటూ.

"పీటలమీద పెళ్ళిళ్ళు జరిగేదాకా నమ్మకం లేదన్న మహానుభావుడివి మరిపార్టీకి రావటం మానెయ్యకపోయావ్ ? అప్పుడే పుచ్చుకునేవాడివిగా ! పైగా బాగుండదంటూ అడిగి మరీ తింటున్నావే!" అన్నాడు ఎప్పుడూ మాటకారి మాటల్ని ఖండించే అలవాటుగల వ్యతిరేకవాది.

"అయినా, అతను శుభమా అని పెళ్ళికెడ్తూ మనకు ఫలహారాలు పెట్టిస్తూంటే యేమిటా మాటలు?" ఎవరో కోపంగా అన్నారు.

"ఫర్వాలేదండీ !" ఎలాగూ తనపెళ్ళి కాదు కాబట్టి సర్దేస్తున్నట్లు అన్నాడు శేఖరం.

ఒకటి రెండు రోజులు సెలవుదొరకటం బ్రహ్మాండం అనుకున్న శేఖరానికి అనుకోకుండా హనుమంతరావుగారి ధర్మమా అని పదిరోజులు దొరికింది. నడుస్తూంటే కాళ్ళు సంతోషంతో తేలిపోతున్నాయి. సూర్యం వుత్తరం అందిన రాత్రే జవాబు వ్రాశాడు. అందులో, తనకి ఇన్‌స్పెక్షన్‌రోజులని, రెండురోజులముందు వచ్చినా చెప్పుకోవాల్సిన సంగతేనని వ్రాశాడు. పాపం, సూర్యం తనువస్తున్నానని అనుకోడు. అనుకోకుండా తను కనపడేసరికి వాడెంత సంతోషిస్తాడో!

ఆరాత్రి బండికి బయలుదేరుతున్న శేఖరం వుల్లాసంగా యీలపాట పాడుకుంటూ బెడ్డింగ్ సర్దుకుంటున్నాడు. 'పిచ్చివాళ్ళు! నిజంగా తనపెళ్ళనే నమ్మేస్తున్నారు. అమాయకులు!

కాకపోతే, నిజంగా తనపెళ్ళే అయితే తను శుభలేఖ లివ్వడూ? ఏమిటో అనుకున్నాడుగానీ ఈ హనుమంతరావుగారు కూడా అమాయకుల్లాగానే వున్నారు. ఇంకాస్త పిచ్చివాళ్ళు తన పెళ్ళికి బహుమానాలుగూడా తెచ్చారు. పోనీ అదీ ఒకందుకు మంచిదే! సూర్యానికి ప్రత్యేకం తను బహుమతులు కొనక్కర్లేదు. ఇవి చదివించేస్తే సరిపోతుంది. అందులో ఆ అగరొత్తులు గుచ్చుకునే వెండి పూలగుత్తి ఎంతముద్దుగా వుంది! అదిచూసి సూర్యం భార్య తప్పకుండా ముచ్చటపడ్తుంది. సూర్యంగూడా సంతోషిస్తాడు. ఇంతకీ తిరిగి వచ్చిన తర్వాత వీళ్ళందరికీ యేమని జవాబు చెప్పడం? ఆఁ, సింగినాదం! వాడెవడో ముందుగానే మార్గం చూపించాడు. పెళ్ళి తప్పిపోయిందని చెప్తే సరి – పాపం! టీపార్టికి వూరికే వచ్చిన వాళ్ళకి ఫర్వా లేదుగాని, బహుమానాలు తెచ్చినవాళ్ళుమటుకు యేడుపు మొహాలు పెట్టారేమో! ఏదయినాగాని మొత్తానికి యీ పెళ్ళిప్రయాణం చాలా వింతగా, హుషారుగావుంది. ఈసారి నిజంగా పెళ్ళయి సెలవడిగితే! అంతగా అయితే అప్పుడు అసలు సంగతి చెప్పెయ్యొచ్చు–అయినా యిప్పుడు మనకోసం కాచుక్కూచున్న వధుమణి ఎక్కడుంది గనుక'! నవ్వుకుంటున్న శేఖరం, రాజయ్య కంఠం వినిపించటంతో వులిక్కిపడి యీ లోకంలోకి వచ్చాడు.

"బాబూ! అయ్యగారు తమర్ని అర్జంటుగా ఒక్కసారి వచ్చి వెళ్ళమంటున్నారు. మీరు రావడం ఆలస్యంచేస్తే ఆరే వస్తారట!" చెప్తూనే రాజయ్య వెళ్ళిపోయాడు. 'అయింది! అంతా అయిపోయింది! హనుమంతరావుగారు అసలుసంగతి తెలుసు

కున్నారులావుంది. ఇప్పుడేం చెయ్యటం?' చల్లబడ్డ కాళ్ళతో శేఖరం బెడ్డింగ్ మీద చతికిలపడ్డాడు. 'తన కసలు బుద్ధిలేదు. పొద్దున బండీ కెందుకుపోలేదు? వెధవబట్టలు... ఆ వూళ్ళో కొనగూడదూ! లేకపోతే వుత్త డబ్బు చదివి స్తేపోలేదు! యిప్పుడు మొదటికే మోసం వచ్చింది. ఆయనెంత మండి పడ్తున్నాడో ? మండిపడ్తే పడ్డాడు. తనసలు తిట్లు తినటానికి యెప్పట్నుంచో సిద్ధంగా వున్నాడుగా ! ఇప్పుడు ఆ సెలవు కాస్తా రద్దుచేస్తే'! పొద్దున వెళ్ళిపోనందుకు తనని తను తిట్టు కుంటూ, బట్టలు వేసుకుని, తప్పని సరిగా హనుమంతరావు గారి యింటికి బయలుదేరాడు. 'ఎన్ని చిందులు తొక్కుతు న్నాడో!' చేతిరుమాలతో చెమట తుడుచుకుంటూ హాల్లో అడుగుపెట్టాడు. హనుమంతరావుగారు సింహంలా గర్జిస్తూ, హాల్లో అటుయిటూ పచార్లుచేయడంలేదు, సరిగదా, మెత్తటి సోఫాలో కూర్చుని శేఖరాన్ని చూడగానే చూస్తున్న పేపరు పక్కకు పెట్టి సాదరంగా చిరునవ్వుతో "రావోయ్, రా! ను వ్వీరాత్రి బండీకి వెళుతున్నావు గదూ !" అన్నారు. హమ్మయ్య! ఒక్కసారి గుండెలనిండా గాలి పీల్చుకున్నాడు శేఖరం.

"ఇటుగో యెవరక్కడ ? రాజయ్యా! శంభుతో రెండు కప్పుల కాఫీ పంపించమని చెప్పు! ఆఁ, ఏంలేదు– నీ ప్రయాణం ఈ రాత్రికేగదూ ?" అడిగారు హనుమంతరావుగారు.

"ఊఁ!" ఏమిటీ విశేషం అన్నట్లు చూశాడు శేఖరం.

"ఆఁ,ఏంలేదు– అమ్మాయేమో బందరు వెళ్ళాలని ప్రయాణం అవుతోంది. ఇవాళ బయలుదేరుదామనుకుని సీట్లు

గూడా రిజర్వు చేయించాను. నేను వెళ్ళటానికి తీరుబడిలేదు. నువ్వు చూస్తూనే వున్నావుగా, కాగితాలు యింటికూడా తెచ్చి రాత్రి పన్నెండుదాకా కూర్చుని చూసినా అవటం లేదు. అమ్మాయేమో తప్పనిసరిగా వెళ్ళాలని పట్టుపడ్తోంది."

కళ్ళజోడు తీసి పై వుత్తరీయంతో తుడుస్తూ అన్నా రాయన. అసలు సంగతేమిటో త్వరగా తేలితే బాగుండునను కుంటున్నాడు శేఖరం.

"ఇక్కడనుంచి త్రూగా ఒకే ట్రెయిన్ అయితే బాధ లేదు. మధ్య బెజవాడలో మారాలి. మంజుకి ఆ లైన్ అసలు తెలియనే తెలియదు. మా వాళ్ళంతా సాధారణంగా పెద్ద వాడిని కాబట్టి నా దగ్గరకే వస్తుంటారు. నేను వెళ్ళటం తక్కువ. అయినా మంజుమాట అటుంచి, ముందు ఆ బెజ వాడ ప్లాట్‌ఫారాలు చూస్తే నాకే భయం. ఏ దెక్కడో, ఏ లైనుమీదికి ఏ బండి వస్తుందో, ఏది ఎటు పోతుందో అయోమయం. ఎవర్నయినా అడిగితే చెప్తారనుకో-అయినా ఆ మహాసముద్రంలో యెవరికి యెవరు? అందులో రాత్రి పూట - ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, అసలు అమ్మాయితో బాటు రాజయ్యనిగూడా పంపిద్దామని రెండుసీట్లు రిజర్వు చేశాను. రాజయ్య కూతురికేమో జ్వరంగా వుందట. ఏం బాగాలేదని తీరా బయలుదేరబోతూంటే యివాళ చెప్పాడు. అమ్మాయి -ఫర్వాలేదు, ఒక్కదాన్నీ వెళ్తానంటోంది. ఎంత యినా రాత్రిపూట! ఆడపిల్ల నొక్కదాన్నీ అందులో మొదటి తరగతిలో-నా కిష్టంలేదు..."

వింటున్న శేఖరం జేబురుమాలుతో విసురుకుంటూ హాల్లోవున్న ఫొటోలవంక చూస్తున్నాడు. ఆడవాళ్ళతో ప్రయాణం అతనికి అంతగా అలవాటులేదు. రెండుసార్లు కాబోలు పెత్తండ్రి తన పెద్దకోడల్ని తీసుకురమ్మంటే కాదన లేక వెళ్ళాడు. 'అబ్బ! అప్పుడు అవస్థ అంతా యింతాగాదు–ఆవిడ తెచ్చిన సామానులు సరిగా వున్నాయో లేదో రైలు ఆగిన ప్రతిచోటా లెక్కచూడమనేది. అదేమయినా కాస్తా కూస్తా! ఇద్దరు కూలివాళ్ళు మోయగా, తను ఆ చేత్తో యీ చేత్తో మోయగలిగినన్నీ, పట్టినన్నీ పుచ్చుకోగా యింకా మిగిలేవి. పైగా మూడురైళ్ళు మారటం – జోలెడంత రద్దీ, మూడోతరగతి. వద్దురా బాబూ, భగవంతుడా! ఆ అవస్థ పగవాళ్ళకికూడా వద్దు. ప్రతి స్టేషన్లో లెక్కపెట్టవలసిందే! అవును మరి–దిగుతూ, యెక్కుతూ యెవడన్నా ఒకటి చంకన పెట్టుకుపోయినా కనుక్కోలేం. ప్రతిసారీ తను సామాన్లులెక్క పెట్టుకోటం చూచి ఆ పెట్టెలో వాళ్ళు ఒకటేనవ్వు. అయినా మంజు చదువుకున్నపిల్ల! రైళ్ళల్లో యెలా క్లుప్తంగా ప్రయాణం చేయాలో నేర్చుకోకుండా వుంటుందా?'

"ఏమిటి అట్లా ఆలోచిస్తున్నావు? పైగా మరొకటి–నువ్వు వేరే టికెట్ కొనక్కర్లేదు. నీకు ఒక ఖర్చు కలిసివచ్చి నట్లు అవుతుంది."

"అబ్బే, లేదండీ! నేను కొనుక్కుంటాను" ఇలాటి మొహమాటాలకి చాలా దూరంలో వుండాలని శేఖరం అనుభవంతో నేర్చుకున్నాడు.

"అబ్బ! నువ్వు కొనుక్కో-లేవనిగాదోయ్! ఎంత పెళ్ళి కొడుకువైతే మాత్రం - ఖర్చుండదూ? మరొకటీ! నువ్వు అమ్మాయిని బందరు ట్రెయిన్ యెక్కి-స్తే చాలు - అక్క-డ స్టేషన్‌కి మావాళ్ళు వస్తారు. అదుగో, కాఫీ తెచ్చాడు తీసుకో!"

ఇష్టం లేకపోయినా మంజులతతో తప్పనిసరిగా ప్రయాణం చేయవలసి వచ్చినందుకు విసుక్కు-ంటూ, ఉదయం వెళ్ళిపో నందుకు తన్ని తను తిట్టుకుంటూ శేఖరం కాఫీకప్పు చేతిలోకి తీసుకున్నాడు.

... ... ...

"మెనీ థ్యాంక్స్!" అంది మంజు కృతజ్ఞతా పూర్వకంగా శేఖర్ కళ్ళల్లోకి చూస్తూ. బెజవాడలో యిద్దరూ దిగారు. మంజులతని బందరుపోయే బండిఎక్కి-ంచాడు శేఖరం. ఎంతో విసుగ్గా, చికాకుగా వుంటుందనుకున్న ప్రయాణం ఆనందంగా, మధురంగా యిట్టే గడిచిపోయిందనిపించింది.

"ఈ జనం, ఈ గోల చూస్తూంటే నిజంగానే భయం వేస్తోంది" అంది మంజు స్టేషన్‌లోని సందడిని గమనిస్తూ.

'పెద్ద పెద్ద కళ్ళతో ప్రతివాళ్ళవైపూ నిస్సంకోచంగా చూసే మంజులత దూరంనుంచి చూస్తే అమాయకురాలిగా, ముద్దరాలిలా కన్పిస్తుంది. కానీ యింత మాటకారి అనిపించదు' అనుకున్నాడు శేఖరం.

'చక్క-టి వాడేగాదు, మంచివాడు గూడాను. ఎవరో ఆ కాబోయే అదృష్టవంతురాలు!' అనుకుంది మంజు కిటికీలో

నుంచి పరధ్యానంగా బైటకు చూస్తున్న శేఖరాన్ని గమనిస్తూ. తెల్లటిబట్టల్తో, మెడచుట్టూ నల్లటి మఫ్లర్ తో చెదరినజుట్టుతో ప్రయాణపు బడలికవల్ల అలసినకళ్ళతో వున్న శేఖరాన్ని రెప్పవేయకుండా చూడాలనిపిస్తోంది.

రైలు కదలటానికి సూచనగా గంట విన్పించింది. ఉలిక్కిపడ్డ శేఖరం కంపార్ట్మెంట్ లోనుంచి గబగబా దిగబోతున్నాడు. ఇంతలో మంజు గబగబా పెట్టె తెరిచి పైనున్న ఒక వెండిసోప్ బాక్స్ తీసి యిస్తూ "ఇదుగో, యిదితీసుకోండి! మీ కిచ్చేందుకు నా దగ్గర యేంలేదు. ఇది మీ శ్రీమతికి. తప్పనిసరిగా యిటువెళ్లాల్సి వచ్చింది. కానీ, లేకపోతే పిలవక పోయినా, వద్దన్నా మీ పెళ్ళికి వచ్చేదాన్ని." తెల్లబోయి చూస్తున్న శేఖరం చేతిలో సోప్ బాక్స్ పెట్టేస్తూ "రైలు కదలబోతోందల్లేవుంది. ఇక మీరు దిగండి!" అంది. 'నా పెళ్ళంటూ జరిగితే పిలవడంగాదు, బలవంతంగా వెంటపెట్టుకుని లాక్కుపోతాను' నాలిక చివరదాకా వచ్చినమాటని బలవంతాన మింగి కదులుతున్న రైల్లోనుంచి చేతిలోని సోప్ బాక్సుతో దిగేశాడు.

'జీవితంలో జరిగే సంఘటనల్లో అతి జాగ్రత్తగా జ్ఞాపకం పెట్టుకోవల్సిన వాటిల్లో! యీ ప్రయాణం ఒకటి!' అనుకుంది మంజు దూరమైపోతున్న శేఖరాన్ని చూస్తూ.

'ఇదేమిటి! హఠాత్తుగా అనుకోకుండా యిలాచేసిందే మంజులత! ఎంత చక్కటి పేరు! ప్రతిరోజూ వుదయం లేవగానే అంత చక్కటికళ్ళు చూసుకునే అదృష్టం ఎవరికో!'

వెళ్ళిపోతున్న రైలులో దూరంగా అస్పష్టమైపోతున్న మంజుని చూసి నిట్టూర్పు విడిచాడు శేఖరం.

శేఖరం రావటానికి వీలవుతుందో కాదో, అసలు పెళ్ళి నాటికైనా వస్తాడో రాడో అని దిగులుపడ్తున్న మిత్రబృందం హఠాత్తుగా శేఖరం వచ్చేసరికి అమితానందం పొంది సంభ్రమాశ్చర్యాలతో చుట్టూ మూగారు.

“యేరా! వుత్తరంలో అట్లా అఘోరించావేం? అయితే అంతా నటనన్నమాట!” ఎముకలు విరిగేలా శేఖరాన్ని కావులించుకున్నాడు సూర్యం.

“అందరూ వచ్చారు. నువ్వొక్కడివే లేవని దిగులెట్టుకుని మేం మూడురోజుల్నుంచీ కాఫీ, ఫలహారాలు మానేశామంటే నమ్ము!” పేకముక్కలు కలుపుకుంటున్న చంద్రం లేచి వస్తూ అన్నాడు.

“నిజంగానే నాకు ఇన్‌స్పెక్షన్ రోజులు—మా ఆఫీసులో ఎవరికీ చచ్చే తీరుబడికూడా లేదంటే నమ్మండి! కానీ నేనో ప్లాన్ వేసి, మోసంచేసి పారిపోయి వచ్చాను” ఠీవిగా అన్నాడు శేఖరం.

“ఏమిటేమిటీ?” అంతా చుట్టూ మూగారు. శేఖరం జరిగిందంతా చెప్పి “కావాలంటే చూడండి!” అంటూ పెట్లోంచి బహుమానాలు తీసి చూపాడు.

“ఎలాగయినా మెరికలాంటివాడివి సుమా!” అన్నాడు భాస్కరం.

"శేషునిజంగా పెళ్ళి అవాలి. అబ్బాయిగారి రోగం కుదురుతుంది!" నవ్వుతూ అన్నాడు సూర్యం.

శేఖరం కథ విన్న బామ్మగారిబోటివాళ్ళు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

"సూర్యం పెళ్ళికాదురోయ్, శేఖరం పెళ్ళి!" స్నేహితులు వేళాకోళం పట్టించారు.

"ఔరా! పిదపకాలం, పిదపబుద్ధులూనూ!" కొంత మంది ముక్కుమీద వేళ్ళుంచుకున్నారు.

"ప్చ! కాలం బాగాలేదు. పిల్లలు మరీ తెగించిపోతున్నారు." వేదాంతులు కళ్ళు మూసుకున్నారు.

ఏదయినా శేఖరం కోరికలు ఫలించాయి. అతని నాయకత్వాన మిత్రబృందం కార్యరంగంలోకి వురికింది. పెళ్ళంతా తమచేతుల మీదే జరిగి పోతుందన్నట్లు గోల ప్రారంభించారు. పెళ్ళికొచ్చిన బంధువులు వీళ్ళ సందడిచూడ ముచ్చటగా వుందని మెచ్చుకున్నారు. పెళ్ళికి తరలివెళ్ళేరోజు వచ్చింది. పెళ్ళికొడుకు స్నేహితులు మరీ కాకిగోల చేస్తున్నారని, ఈ గోల పెళ్ళికూతురుగారి వూళ్ళో గూడాచేస్తే మన పరువు పోతుందని ఒక పెద్ద మనిషి సూర్యం తండ్రిదగ్గర గుసగుస లాడాడు. ఆయన నవ్వి—"పోనీండి, కుర్రాళ్ళు! వాళ్ళ సరదాకి మనం అడ్డు రాకూడదు. అయినా మగపెళ్ళివారిలో ఆ మాత్రం చలాకీ తనం లేకపోతే యెలా?" వచ్చిన పెద్ద మనిషి మొహం పెసరట్టుమాడిపోయినట్టు మాడిపోయింది.

పెళ్ళికూతురిది బందరు అనేసరికి శేఖరం పొరపాటు చేశాననుకున్నాడు. మంజులతని అడ్రస్ అడిగివుండవలసింది.

అయినా తనకేం తెలుసు? శుభలేఖలో బందరని లేదుగా! ఇదే సూర్యాన్నడిగితే—అతను జవాబు యిలా ఇచ్చాడు!

"అది మరీ పల్లెటూరురా! రాకపోకలకి సౌకర్యంలేదు. అందుకని నాన్నగారు బందరులో చేయమన్నారు"

పెళ్ళి రేపనగా ముందురోజు రాత్రే అంతా బందరు చేరుకున్నారు. పెళ్ళికొడుక్కంటే, బంధువులకంటే, అసలు వియ్యాల వారికంటే మధ్య ఈ పెళ్ళికొడుకు స్నేహితులకి మర్యాదలు చాలటంలేదు. 'చచ్చిపోతున్నాం పరుగులు పెట్ట లేక'-బిగ్గరగానే విసుక్కున్నారు. శేఖరంవాళ్ళు ఆ నసుగుడు విన్నారు. వినాలనే వాళ్ళన్నారు. తాము వినాలని వాళ్ళు అన్నారు కొబట్టి శేఖరంవాళ్ళు నవ్వి వూరుకున్నారు. పెళ్ళి కొడుకు పక్క అబ్బాయిలెలా తక్కువ లేరో, పెళ్ళికూతురు పక్క అమ్మాయిలకిగూడా లోటులేదు. పెళ్ళిపెద్దయిన ప్రసాదు, సూర్యానికి ముఖ్య స్నేహితుడు. అటుగూడా చుట్ట రికం లభించినందుకు పెళ్ళికొడుకు స్నేహితులు పొంగిపోతూ— భుజాలు యెగరేశారు. వీళ్ళని చూస్తున్న అమ్మాయిల బృందం మూతులు, ముక్కులు మూడు వంకర్లు తిప్పింది.

ఉదయం పది గంటలకి లగ్నం అయిపోయింది. పురో హితుడు సూర్యాన్ని, భార్యని కూర్చోబెట్టి ఇంకా యేమిటో చేయిస్తున్నాడు. అగ్నిహోత్రం ముందుకూర్చున్న వధూవరులకి చెమటలు కారిపోతున్నాయి. ఇది గమనించిన ఒక స్నేహితు రాలు ఒక విసనకర్ర తీసుకొచ్చి పెళ్ళికూతురికి మాత్రం తగిలే టట్లుగా విసరసాగింది. సూర్యం నిస్సహాయంగా తన స్నేహి

తులవైపు చూచాడు. ప్రభాకరం చటుక్కున లేచి పక్కనున్న ఓ పెద్దమనిషి పైమీది వుత్తరీయం లాక్కొచ్చి సూర్యానికి విసరటం మొదలుపెట్టాడు. మొదట అంతా తెల్లబోయినా, అసలు సంగతి గ్రహించి ప్రభాకరాన్ని, ఆ అమ్మాయిని యిద్దర్నీ వెనక్కు రమ్మనమని మరో మనిషిచేత యిద్దరికీ గాలి వచ్చేటట్లు విసిరించారు. పెళ్ళంతా సూర్యం కోరికపై రీలుగా ఫోటో తీస్తున్నాడు శేఖరం. ఇంతలో 'పెళ్ళికొడుకు స్నేహితులకి ఆకలవుతోందట. అర్జంటుగా, వున్నపళంగా కాఫీ టిఫెన్లు కావాలట' అని విడిదినుంచి కబురొచ్చింది. "ఇప్పుడేం కాఫీలూ? ఓచంపన భోజనాలకి లేవబోతుంటే!" ఎవరో బుగ్గన వేలుంచుకున్నారు.

"మగపెళ్ళివారు కదటమ్మా, శాణతనాలు! తాటాకు విసనకర్రతో గబగబా విసురుకుంటున్న ఒక స్థూలకాయం చెమట తుడుచుకుంటూ అంది. అంతవరకూ వధూ వరుల దగ్గర కూర్చుని చూస్తున్న పెళ్ళికూతురు తండ్రి లేచి ఓ గది వైపుగా వెళ్ళి "అమ్మాయి మంజూ!" అని పిల్చారు. ఒక సారి తీసిన ఫోటోనే మరో కోణంనుంచి తీస్తున్న శేఖరం వులిక్కిపడి అటు తిరిగాడు. అప్పటికే ఆయన, వెంటనే కాఫీ వుప్మా పంపించమని చెప్పేసి తిరిగివచ్చి యథాస్థానంలో కూర్చున్నారు. బహుశా ఆ గదికి లోపలద్వారం వుందేమో! ఆ మంజులతాదేవి యెవరో యిటుమటుకు రాలేదు. శేఖర్ మళ్ళా కెమేరా సరిచూసుకునే గొడవలో పడిపోయాడు.

"అన్యాయం! యింతకంటె అవమానం యింకోటి లేదు. యింత పరాభవానికి ప్రతీకారం చెయ్యకుండా యెలా వూరుకునేది ?" భోజనాలయిం తర్వాత అందరూ విడిదికి తిరిగి వచ్చేసి పేకాటముందు కూర్చోబోతుండగా చంద్రం గుండెలు బాదుకున్నాడు.

ఇంతవరకూ బాగానేవుంది-ఇంతకుమునుపే నింపాదిగా, సలక్షణంగా భోంచేసిన వీడికి ఇంతలోనే ఏమయింది అన్నట్లు చూశాడు సూర్యం.

"యేమిట్రా ? ఏమయిందీ? ఎవరయినా అమ్మాయి నువ్వడిగింది వడ్డించలేదా ?" పేకముక్కలు కలుపుతూ అన్నాడు శేఖరం.

"అదిగాదురా! ఇందాక నిజంగానే ఎంతవమానం జరిగిందీ! మేమంతా కాఫీలు, టిఫిన్లు కావాలని కబురెట్టలా ? అప్పుడు..."

"అప్పుడేయిందీ ? పంపించారుగా !" అన్నాడు శేఖరం.

"పంపించార్లే మహాలావ్ !" ప్రభాకరం చేతులు తిప్పాడు.

"యేమయిందీ! అసలు సంగతిచెప్పండి మరి!" అన్నాడు శేఖరం. తనీ బృందానికి నాయకుడు గాబట్టి నిజంగా అలాటి అవమానం యేదయినా జరిగితే, తప్పకుండా ప్రతీకారం చేయాల్సిందే !

"యేముందిరా! అడిగిన అరగంటకే కాఫీ, ఉప్మా పంపించారు. కానీ కాఫీలో పంచదార లేదు. పైగా యేమిటో ఉప్పగా ఉంది. ఉప్మాలో ఉప్పులేదు. పైగా ఆ పట్టించుకొచ్చిన వాళ్ళలో ఒకమ్మాయి 'మర్చిపోయారేమో! అయినా నిజంగా ఆకలుంటే అసలు రుచెందుకూ ?' అన్నది. ఒళ్ళు మండిపోయిందనే నమ్ము! పైగా 'పోన్లెండి, మళ్ళీ మంచివి చేయించుకొస్తాం' అంటూ వెళ్ళింది. మళ్లా అయిపులేదు. ఈ లోగా భోంచేశాం."

"మర్చిపోయారేమో నిజంగానే! నవ్వుతూ అన్నాడు సూర్యం.

"చూడు, చూడు ! అప్పుడే మూడు ముళ్ళూపడి మూడుగంటలుకూడా కాలేదు. యెలా వెనక వేసుకొస్తున్నాడో !!" వెంకట్రావు కన్ను గీటాడు.

"అయితే- వాళ్ళు తెస్తే, వెర్రిమొహాల్లాగా మాకీ కాఫీ బాగాలేదు. మళ్లా తెండి అని వాళ్ళని బ్రతిమలాడు కునా్నరన్నమాట! ఇంకా పైగా మళ్ళీ కన్పించలేదంటారేం? తెలివిగలవాళ్ళు వాళ్ళు-"

"మరేం చెయ్యమంటావురా!" యేడుపు మొహం పెట్టాడు ప్రభాకరం, అసలు చెప్పకుండావుంటే బాగుండేదేమో అనుకుంటూ.

"ఏడవమంటాను! ఆ మాత్రం తలలేదుట్రా? కాఫీలో పంచదార, వుప్మాలో వుప్పు రెండూ ఒక్కసారి యెందుకు మర్చిపోయారని ఆ మాత్రం గ్రహించలేక పోయారన్న

మాట-వాళ్ళు కావాలని మర్చిపోయారని స్పష్టంగా కన్పిస్తూంటే ఎప్పుడైతే మీకు అనుమానం తగిలిందో వెంటనే 'అబ్బే! యెందుకండీ? యిప్పుడే భోజనాలకి లేవబోతున్నాం అనే సంగతి మాకు తెలియక కబురు పంపాం - వద్దండీ! మీ వాళ్ళకే యెవరికయినా పెట్టండి!' అంటే బాగుండేది." శేఖరం తెలివికి అంతా మెచ్చుకున్నారు. ఆ సమయంలో అతనే అక్కడుంటే యెంత బాగుండేది అనుకున్నారంతా -

పసందయిన పేకాటలో మూడుగంటలు యిట్టే అయింది. పెళ్ళికొడుకు స్నేహితులు పేకాట చాలించి కబుర్లలో పడ్డారు. ఆడవాళ్ళు అప్పుడే మొహాలు కడిగి ముస్తాబవుతున్నారు.

ఈ పెళ్ళికి శేఖరం ఎలా వచ్చాడో, యేవిధంగా ఆఫీసరుకి మస్కా కొట్టాడో అందరికీ చెబుతున్నాడు ప్రభాకరం.

"అవిగో! ఫలహారాలొచ్చేశాయి" అన్నాడు చంద్రం.

"ఆగరా! వెధవగొడవా నువ్వూను. అవి మనకోసమేగా తెచ్చింది, మళ్ళీ పట్టుకుపోరులే!" ఎవరో విసుక్కున్నారు.

చెప్పేది తన విషయం అవటంవల్ల అంతా మధ్యమధ్య నవ్వుతూ శేఖరంవైపు చూస్తున్నారు. ఇంత కథకి కథానాయకుణ్ణి నేనే గదా అని శేఖరం కాలర్ సవరించుకుని నిటారుగా కూర్చోబోయాడు. హఠాత్తుగా అతని దృష్టి అక్కడికి కొద్ది దూరంలో ఆడవాళ్ళ మధ్య ఒక స్తంభానానుకుని ప్రభాకరం చెప్పే కథనివింటూ కన్నార్పకుండా చూస్తున్న ఓ అమ్మాయి

మీదపడింది. అతనికళ్లు చెదిరినట్లయింది. 'ఎవరూ ఆ అమ్మాయి! ఇంకెవరూ? మంజులతే! నిజమేనా?' కళ్లు ఒకసారి గట్టిగా మూసుకుని మళ్ళా తెరిచి చూచాడు. ముచ్చటైన పదాలతో ప్రభాకరం చెప్పేది వినసొంపుగా వుండటంవల్ల గాబోలు చాలామంది వింటున్నారు. శేఖరం మొహంలోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. తను చూస్తున్నది కలో, నిజమో అర్థం గావటంలేదు. అసలీ పెళ్ళికి తను వచ్చాడా, యెక్కడయినా కూర్చుని కలగంటున్నాడా! అంతా అయోమయంగా అనిపించసాగింది.

ఆడపెళ్ళివారిలో పెద్దపెద్దకళ్ళుగల ఒకచక్కటి అమ్మాయి అనుకున్న స్తంభాని కంటుకుపోయి రెప్పవాల్చకుండా తనవైపు చూస్తూ, చెవులు నిక్కబొడుచుకుని తను చెప్పేది వింటోందని గ్రహించిన ప్రభాకరం యింకా పొంగిపోయి వున్నవి, లేనివి కలిపి మరింత జోరుగా చెబుతున్నాడు. 'వెధవ గొంతూ వీడూను! కాస్త నెమ్మదిగా నయినా చెప్పడేం? మైక్ లేకపోయినా మూడుమైళ్ళు విన్పిస్తుంది. ఇప్పుడు తను వద్దంటే అంతా తనవైపు చూస్తారు. మంజులత గూడా చూస్తుంది. అప్పుడు తనెందుకువద్దన్నాడో అర్థంచేసుకుంటుంది. పోనీ ఊరుకుందామా అంటే, వీడు లేనిపోని విషయాలుగూడా కలిపి చెబుతున్నాడే! శేఖరానికి చాపక్రింద పెద్ద పెద్ద ముళ్ళున్నట్లు, చిన్న చిన్న జెర్రిపిల్లలు షర్టులోపలికి పోతున్నట్లు అనిపించింది. వెధవది, చాపక్రిందనుంచి ప్రభాకరంగాడిని ఓ తేలయినా కుట్టే బాగుండు!' ఇంతోటి కథకి అందరూ తన

వైపు చూడడం గూడాను!' నవ్వకపోతే బాగుండదు. ఏడవ లేక ఇకిలించేశాడు శేఖరం.

"అదేమిట్రా అలా ఒక్కసారి నీరసపడిపోయావు? ఒంట్లో బాగా లేదా?" హాల్లో ఒకమూల బెడ్డింగ్ పరుచుకుని పడుకున్న శేఖరాన్ని శరీరంపట్టి తాకిచూస్తూ అడిగాడు సూర్యం.

"విపరీతమైన తలపోటుగా వుందిరా!" కళ్ళమీదనుంచి చేతులు తీయకుండానే జవాబిచ్చాడు శేఖరం.

"అదేమిటి? ఇందాకటివరకూ బాగానే వున్నావుగా! డాక్టర్నెవరయినా పిలిపించమంటావా?" పక్కన కూర్చుంటూ అన్నాడు సూర్యం.

"ఆఁ! అయిందీ! బెడ్డింగు పరిచాడూ? వద్దురా నాయనా అంటే వింటేనా? ప్రతి పనిలోనూ వీడే! పెళ్ళి పందిట్లో ఏ మూల చూసినా వీడే! అందరికళ్ళూ వీడిమీదనే రామ రామ! సూర్యం! నీ కోపం వస్తే వచ్చిందిగానీ, ఆ అమ్మాయిల కళ్ళు వీడిని వదల్లేదంటే నమ్ము! అక్కడికీ ఎందుకయినా మంచిదని, రెండు మూడు సార్లు తెలియనట్లు వీడికడ్డంగా గూడా నిలబడ్డాను. ఎవరోగాని పిడుగులాంటి పిల్ల! 'పౌర్ణమినాటి చంద్రుడికి అడ్డంగా వచ్చిన రాకాసిమబ్బులా ఈయనెవరూ మధ్య' అంది. ఆ అమ్మాయిని గుర్తుంచుకున్నా ననుకో—వీడికి దిష్టేరా! ముమ్మాటికీ దిష్టే!" శేఖరానికి మరో పక్క వచ్చి కూలబడ్డ చంద్రం, శేఖరం చేతుల్ని ఆప్యాయంగా రాస్తూ అన్నాడు.

ఆ తర్వాత ముగ్గురు నలుగురు ముత్తైదువులు గూడా పళ్ళుపట్టి చూసి జ్వరంలేదని, ఇది దిష్టేనని తేల్చి ఆడపెళ్ళి వారి నడిగి, ఇంత ఉప్పూ-మిరపకాయలు తీసేశారు.

"మధ్య ఈ వెధవగోల ఏమిటే? అసలే తోచక చస్తూంటే!" శేఖరం అందర్నీ తిట్టాడు.

ఇష్టంలేకపోయినా తప్పనిసరిగా, అందరి బలవంతం మీాద, ముఖ్యంగా శేఖరం పట్టుదలమీాద సూర్యం ఊరేగింపుకు వెళ్ళాల్సివచ్చింది. మొత్తానికి అంతా ఊరేగింపుకు వెళ్ళి పోయారు. ఎవరో నడవలేనివాళ్ళు, రాత్రిపూట అంతగా చూపు కనబడనివారు మాత్రం మిగిలిపోయారు. ఆలోచనలతో శేఖరం కణతలు పగిలిపోతున్నాయి. 'సెలవు దొరకగానే కోటలో పాగా వేశా'నని పొంగిపోయాడు. పోనీ అలాగని వూరుకున్నాడా? స్వయంగా డబ్బా కట్టుకుని మోగిస్తూ అందరికీ చెప్పాడు, ఇది హనుమంతరావుగారు తెలుసుకుని యెంత మండిపడతాడు? పోనీ ఆయనొక్కడయినా అంత బాధలేదు. అంతగా అయితే- ఉద్యోగంతీసేస్తాడు, అంతేగా! వెధవ ఉద్యోగంకోసం గాదు. తనెలాగూ ఇక అక్కడకు వెళ్ళడు. వెళ్ళీ, అక్కడ ఆ అవమానం అంతా వహించేకంటె పోస్టులో రాజీనామా పంపేయటం మంచిది. అదెలాగూ ఖాయమేగానీ, మంజులత! ఆవిడదగ్గర తన పెళ్ళిబహుమానం అంటూ సోప్ బాక్సుగూడా తీసుకున్నాడే! తీసుకున్నవాడు అన్ని బహుమానాలతో పాటుఅదిగూడా సూర్యం భార్యకు యెందుకు యిచ్చెయ్యలేదు? మంజు ఏమనుకుంటుంది? ఇందులో అసలు తన మోసమేమీా లేదనీ, అసలీమార్గం చూపించింది వాళ్ళ

నాన్నగారే అని మంజుకెలా చెప్పటం? తనాఫీసరుగా
రమ్మాయి మంజు అని తెలిస్తే అందరిలో యెంత ఝుదిగా
వుంటుంది! ప్రభాకరం కల్పించి చెప్పినవికూడా నిజమేనని,
వాళ్ళ నాన్నగార్ని అలా అంటున్నందుకు బాధపడుతుం
దేమో! అయినా బాధపడేందుకు ఏం తిట్టలేదుగా! ఆయన
మతిమరుపుని కాస్త వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు. ఇప్పుడేం
చెయ్యటం? పోనీ మంజుని పిలిపించి వున్న విషయం చెప్తే!
ఏముంటుంది? అవును నిజమే! అసలు కొంచెం కాఫీ కావాలని
కబురు పంపితేసరి. వచ్చినమనిషిద్వారా మంజు వుందో, లేక
సూర్యం వాళ్ళతో బాటు వూళ్ళోకి వూరేగింపుకి వెళ్ళిందో
తెలుసుకోవచ్చు. ఒకవేళ వుంటే ఇక్కడికి వస్తే సరే సరి,
లేకపోతే రానంటే తనే వెళ్ళవచ్చు. అయినా తనకి కాఫీ
కావాలని పెళ్ళివారింటికి కబురు పట్టుకెళ్ళేవారుమటుకు యేరీ?
తనే చూడవచ్చు' శేఖరం లేచి పెళ్ళివారింటి వైపు నడక
ప్రారంభించాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. వరండా ముందున్న సన్న
జాజి వాసనల్ని గుమ్మరిస్తోంది. గ్యాస్‌లైట్లు అక్కడక్కడా
ఉన్నాయి. చాలాలైట్లు పెళ్ళివాళ్ళతో వూరేగింపుకు వెళ్ళి
నట్లున్నాయి. వరండా మెట్లెక్కి హాలు లోపలికి వచ్చాడు.
అక్కడెవరూ లేరు. గోడదగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చు
న్నాడు శేఖరం. పచ్చిమామిడాకుల వాసన మనసులో
మధుర భావాల్ని రేపుతోంది. ఇల్లంతా పెళ్ళివాసనలో నిండి
వుంది. ఇంతలో అలెవరో పని మనిషిలాగుంది, జుట్టుముడేసు
కుంటూ వచ్చి శేఖరాన్ని చూచి ఆగిపోయింది.

"కొంచెం కాఫీకావాలి, యింట్లో యెవరయినా ఉన్నారా ?" మంజులతని పేరుపెట్టి అడిగే సాహసం లేక పోయింది. ఇంట్లో లోపల యెవరిదో కంఠం విన్పిస్తోంది. అదిమటుకు మంజులతది కాదు. శేఖరానికి నిశ్చయంగా తెలుసు.

"యెవరే వచ్చింది. సరిగ్గా చెప్పవేం ? యిప్పుడు కాఫీ యేమిటి ?" పైటచెంగుతో చేతిని తుడుచుకుంటూ హాల్లోకి వచ్చింది. శేఖరం వెంటనే లేచి నిలబడ్డాడు. వచ్చింది మంజులత !

"ఆఁ ! మీరా !" శేఖరాన్ని గుర్తించగానే వెనక్కడుగువేస్తూ ఆశ్చర్యంగా అంది.

"అవునండీ, నేనే ! ఒక్కమాట చెప్పి పోదామని వచ్చాను. సూర్యానికి, నాకు గల స్నేహం మీరు చూశారుగా ! వాడికోసమే యింత అబద్ధం ఆడవలసి వచ్చింది. అంతకు తప్ప నాకే దురుద్దేశం లేదు. రైలులో అంతసేపు ప్రయాణం చేశాంగానీ, మీరెక్కడకు వెడుతున్నారో అడగలేదు. అడిగివుంటే యింత అనర్థం జరిగేది కాదేమో ! నన్ను క్షమించండి! ఇదుగో, మీ సోప్ బాక్సు !" అంటూ, గబగబా శేఖరం జేబులోనుంచి తీయబోయాడు. కొయ్యబారిపోయి వింటూన్న మంజు ఒక్కసారి తెప్పరిల్లినట్లుగా, "యేమిటి మీ రనేది ? అసలు మీ రిక్కడకు యెందుకు రావాలి ? ఇప్పుడెవరయినా మీరు నాతో మాట్లాడటం విని అడిగితే నేనేం జవాబు చెప్పను ? ఒంట్లో బాగాలేదని వంక

పెట్టి ఒక్కరూవుండి చేసేపని యిదా? అదిగో మా బామ్మ వస్తోంది. మీకు కాఫీపట్టుకొస్తాను" మరోమాటకి అవకాశం యివ్వకుండా గిరుక్కున వెనక్కు తిరిగింది మంజు. సాంతం లోపలకు పోకముందే బామ్మగారు యివతలకు వచ్చారు. ఆవి డని చూడగానే శేఖరం చటుక్కున సోప్ బాక్స్ జేబులో పెట్టేసుకున్నాడు.

"ఎవరే మంజూ?" ఆవిడకు దూరదృష్టి ఆనదులావుంది. శేఖరం కుర్చీలో కూర్చున్నాడు.

"పెళ్ళికొడుకు స్నేహితుడికి జ్వరం వచ్చిందని ఇందాక బాబాయి చెప్పలా! వారికి తలనొప్పిగా వుందట, కాఫీ కావా లట!" మంజు అంటూనే లోపలకు వెళ్ళిపోయింది. బామ్మగారు శేఖరం దగ్గరగా వచ్చారు. "యేంనాయనా! విడిదిలో ఒక్క డివీ వున్నావా ?"

"ఊఁ!... శేఖరం నీరసంగా మూలిగాడు. ఆ తర్వాత మంజురాలేదు. మరోమనిషి కిచ్చి కాఫీపంపింది. పొద్దుట్నుంచీ పెళ్ళి పందిట్లో మెరపులా తిరిగింది. శేఖరమేనని తెలుసుకున్న బామ్మగారు కుతూహలంతో చాలావిషయాలు మాట్లాడింది.

పెళ్ళయిపోయింది. మూడు నిద్దర్లు అక్కడా, యిక్కడా గూడా అయిపోయినాయి. పెళ్ళికి వచ్చిన బంధువు లంతా వెళ్ళిపోయారు. దగ్గర దగ్గర పదహారు రోజుల పండగకూడా వెళ్ళబోతోంది. పెళ్ళయింతర్వాత ఒక్కక్షణంగూడా వుండ నన్న శేఖరం మెదలకుండా వూరుకోవడం, ఎప్పుడూ సరదాగా తిరుగుతూ, తను నవ్వి యెదుటవాళ్ళని నవ్విస్తూండే మనిషి

పరధ్యానంగా యేదోవిధంగా వుండటం సూర్యానికి అనుమానం వేసింది.

ఒకరోజు మధ్యాహ్నం కాఫీలు తాగు తూండగా సూర్యం అడిగాడు:

"ఆఫీసుకు యెన్నిరోజులు శలవుపెట్టావురా? అని.

"యేం కష్టంగావుందా? అయితే చెప్పు! ఈ సాయంత్రమే వెళ్ళిపోతాను."

స్నేహితుడు అలవాటు చొప్పున నవ్వుతూ అంటున్నాడనుకుని తనుగూడా నవ్వుతూ తలెత్తిన సూర్యం తెల్లబోయాడు. శేఖరం తాగుతున్న కాఫీకప్పు సగంలోనే క్రింద పెట్టేశాడు. మొహం చాల సీరియస్‌గా వుంది. 'అదేమిటి! ఆ కళ్ళు అలావున్నాయేం?' సూర్యం లేచి శేఖరం పక్కకు వచ్చి కూర్చున్నాడు.

"అదేమిట్రా! అలా అంటావు? నువ్వుండటం నాకు కష్టం అవుతుందా? నువ్వేనా అనేది ఆ మాట! యెన్నిరోజులు సెలవు పెట్టావో చెప్పమంటే అంత కోపం దేనికి? అయినా వూరికే వున్నావన్న మాటగాని. అదోలా వున్నావెందుకనీ? నిన్న రామకృష్ణ దగ్గరికెందుకూ వెళ్ళావుట?"

"అతని ఆఫీసులో ఏవో ఖాళీలున్నాయంటే వెళ్ళాను"

శేఖరం చెప్పేదేమిటో సూర్యానికి అర్థంగావటంలేదు. "యేమిట్రా నువ్వనేదీ?"

ఎంతో బలవంతంమీద లాలించగా, ప్రేమతో కోప్పడగా చివరకు శేఖరం జరిగిందంతా చెప్పాడు.

"దానికి నువ్వింత అనుమానపడటం దేనికీ? మన చంద్రం వున్నాడుగా, అతన్ని తీసుకువెళ్ళు. కాదంటే నేనూ వస్తాను."

"లేదు, ఇంకెందుకూ? రిజైన్ చేసి అప్పుడే వారంరోజు లవుతోంది. ఈపాటికి యింకెవరికయినా యిచ్చేయటంగూడా జరిగిపోయివుంటుంది."

సూర్యం చేతుల్తో తలపట్టుకూర్చున్నాడు. అతనికేం చెయ్యాలో తోచటంలేదు. చివరికి కోపంగా లేస్తూ "అసలు పెళ్ళికి రాకపోతేమటుకు యేమయిందీ? దీనికోసం బంగారం లాంటి వుద్యోగం పోగొట్టుకున్నావా? పోనీ రిజైన్ చేసే ముందు నాకు చెప్పావా? నేను చంద్రంతో ఏదయినా మాట్లాడే వాడ్నిగా! ఛి,ఛీ! మొదట్నుంచీ నీ తత్వమే అంత! ఎవరయినా వింటే మధ్య నన్ను తిట్టిపోయ్యేరూ? లే! లేచి బట్టలు వేసుకో_"

"యెందుకూ?" ఎప్పుడూలేంది సూర్యం తనంటే కోప పడటం చూచి తెల్లబోతూ అడిగాడు శేఖర్.

"నన్ను తీసుకువెళ్ళి కృష్ణలో గిరాటు వేద్దుగాని_"

సూర్యం కోపంగా వెళ్ళిపోయాడు.

అలాగే కూర్చుండిపోయిన శేఖర్ దగ్గరికి సూర్యం మళ్ళా తిరిగివచ్చాడు. "లేవరా నాయనా! అయిదున్నర అయింది. బందరుకి ఇప్పుడు రైలువుంది. లేకపోతే బస్సులో పోదాం. వెళ్ళి చంద్రాన్ని అవసరమయితే కాళ్ళు పట్టుకుని వాళ్ళ పెదనాన్నగారికి వుత్తరం వ్రాయమందాం"

"నాకోసం నువ్వు..." శేఖరం మాట పూర్తి చేయ లేదు. మధ్యలోనే ఆపుజేస్తూ "యింక చచ్చినా నీ మాట ఒక్కటిగూడా వినను. పద, వెళ్లి పదినిమిషాల్లో తయారై రా!"

"టెలిగ్రాం సార్!" వాకిట్లోనుంచి పోస్టుమన్ కేక వినిపించడంతో యిద్దరూ లేచి బైటకొచ్చారు.

"క్. శేఖర్ గారు ఎవరండీ? కేరాఫ్ మీా అడ్రస్‌కు వచ్చింది."

"శేఖరం యితనే!" సూర్యం టెలిగ్రాం అందుకుని చించాడు. సూర్యం భుజాలమీాదనుంచి శేఖరం చూస్తున్నాడు. అందులో యింగ్లీషులో యిలావుంది. "నీ రాజీనామా అంగీక రించబడలేదు. వెంటనే బయలుదేరిరా!" అది హనుమంత రావుగారు స్వయంగా యిచ్చింది. "యింకేంరా!" సూర్యం వికసించిన మొహంతో, శేఖరం మొహంలోకి చూచాడు. "లేదురా! వుహుఁ - నేనసలు అక్కడికి వెళ్ళదల్చుకోలేదు. ఆయన కసలు విషయం తెలిసివుండదు. బహుశా మంజు యింకా బందరులోనే వుందేమో!" ముడుచుకున్న మొహంతో దూరంగా వెళ్ళిపోయాడు శేఖర్.

"నీ కసలు మతి సరిగ్గావుందా? పద, ముందు డాక్టరు గారి దగ్గరకు వెళ్దాం." కాగితాన్ని మడిచి కవరులో పెట్టేస్తూ అన్నాడు సూర్యం.

"నీ దయవల్ల యిప్పటివరకూ సరిగానే వుంది, ఇక ముందేమో చెప్పలేనుగాని" మరో సమయంలో అయితే సూర్యం, శేఖరం అంత చక్కటి చిరునవ్వు నవ్వినందుకు ఆనం

దంతో అభినందించేవాడే! ప్రస్తుతం అతనికి శేఖరం ప్రవర్తన తల్లో మంటలు పెట్టోంది.

"యేమండోయ్, బావగారూ! వాకిట్లోనే దర్శనం యిచ్చారు. అయితే వచ్చినపని శుభాంతమే ననుకోవచ్చా?" ప్రసాదు నవ్వుతూ వరండా మెట్లెక్కి వస్తున్నాడు. స్నేహితులిద్దరూ తెల్లబోయారు.

"ఏమిటి విశేషం?" ప్రసాద్ అకారణంగా యెందుకు వచ్చాడో అర్థంగాక తెల్లబోతూ అడిగాడు సూర్యం.

"ముందు లోపలకువచ్చి కొంచెం మంచినీళ్లు తాగనీ! ఇదివరకులా ఒక్క స్నేహితుడే కాదు. బావమరది గూడాను" శేఖరం నవ్వుతూ అన్నాడు.

లోపలికివచ్చి కూర్చున్న తరువాత "మా పెద్దనాన్నగారి దగ్గర్నుంచి వుత్తరం వచ్చిందండీ! ఉదయమే వద్దామనుకుంటే తీరుబడికాలేదు" జేబులోనుంచి ఉత్తరం తీసి యిస్తూ అన్నాడు ప్రసాదు. వుత్తరం అందుకున్న సూర్యం ఒకసారి శేఖర్ మొహంలోకి చూచి చదువుకోవటం మొదలుపెట్టాడు. అసలు ప్రసాదు పెదనాన్నెవరో తనకు తెలియనట్లు మొహం పెట్టి అదేదో వాళ్ళ వ్యవహారంగా శేఖర్ గోడకున్న ఫొటోలకేసి చూడసాగాడు.

"ఊఁ! మొత్తానికి మావాడు యీ పెళ్ళిప్రయాణంలో వక్కనుతొక్కి బయలుదేరాడన్నమాట." వుత్తరాన్ని శేఖర్కిస్తూ, నవ్వుతూ అన్నాడు సూర్యం. తన కివ్వబడిన వుత్తరాన్ని యాంత్రికంగా చదువుకున్నాడు శేఖర్. చదువుతూంటే

క్రమంగా అతని మొహంలో భావాలు మారడం మొదలు పెట్టాయి.

'చిరంజీవి ప్రసాదుకి—

నువ్వు వ్రాసిన వుత్తరం, చి॥ సౌ॥ మంజు వ్రాసిన వుత్తరం రెండూ అందినాయి. శేఖరం పెళ్ళి ప్రయాణంలో యింత గొడవ వుందని నాకు తెలియదు. మొన్న అతని దగ్గర నుంచి హఠాత్తుగా రాజీనామా వస్తే ఆశ్చర్యపోయాను. ఎంత ఆలోచించినా కారణం తెలియలేదు. మంజు వుత్తరం చూశాక గానీ అసలు విషయం పూర్తిగా అర్థంగాలేదు. పోనీ పొరపాటున నేను ఏదో అన్నాననుకో! దానన్నతడు సర్ది వేయగూడదూ! అయినా అంతా మన మంచికే నన్నట్లు ఆనాడు నేనీ పొరపాటు చేయకపోతే శేఖర్ యీ నాటకం ఆడేవాడుకాదు. ఇంతకీ అన్నింటికంటే నేను ఆనందిస్తున్న విషయం, శేఖర్ పట్ల అమ్మాయికిగల అభిమానం! వుత్తరం జాగ్రత్తగా వుంచాను, నువ్వొచ్చినప్పుడు చూపిస్తాను. అమ్మ యేమంటోంది? శేఖరానికీ, మంజుకీ యీడూ జోడూ బాగుం డంటోందా? ఇది నీ సలహాయే అనుకుంటాను. ఏమిటే, యీ మధ్య చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళి చేసెయ్యాలని కంకణం కట్టుకున్నా వేమిటి? కుఱ్ఱాడు నాకు బాగానే తెలుసు. అన్ని విషయాలూ నువ్వు తెలుసుకుని అమ్మకిచెప్పి మీరంతా బాగుంది అంటే నా అభ్యంతరం ఏంలేదు. మంజు అక్కడే వుందిగదా! బహుశా అడగక్కర్లే దనుకుంటాను. ఈ రోజే శేఖరం పేర వచ్చేయమని టెలిగ్రాం యిస్తున్నాను. ఎందుకయినా మంచిది. అతను అక్కడుండగానే ఒకసారి వెళ్ళి సూర్యం సమక్షంలో

అన్నీ మాట్లాడితే బాగుంటుందేమో! మంజు వచ్చేప్పుడు అమ్మనుగూడా పంపు! మీ అమ్మ, ప్రకాశం బాబాయిగారింట్లో అందరూ క్షేమంగా వున్నారని తలుస్తాను. సాధ్యమైనంత త్వరలో మంజుని పంపు! నాకిక్కడేం తోచడంలేదు. ఇదంతా జరగడానికి నా పరధ్యాన కారణం గాబట్టి శేఖరాన్ని క్షమిస్తున్నానని వెంటనే బయలుదేరి రమ్మనమన్నానని చెప్పు!

ఇట్లు,

ఆశీర్వచనములతో

హనుమంతరావు'

... ... ...

"అదేమిటోయ్! మొన్ననేగా పెళ్ళంటూ వెళ్లావు? మళ్ళీ పెళ్ళి అంటావేమిటి?" తన పెళ్ళి శుభలేఖ లిస్తున్న శేఖర్ వంక ఆశ్చర్యంగా చూశారు తోటి గుమాస్తాలు. శేఖర్ చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

"మన హనుమంతరావుగారమ్మాయి మంజులతోట గదూ!" యెవరో అన్నారు.

"అయితే మాకు పప్పన్నం వుందన్నమాట. ఈసారి బహుమానాలు తీసుకుని మరీవస్తాం లేవోయ్ శేఖర్!" అన్నాడు మాటకారి నవ్వుతూ.

"యేం, ఈసారి అనుమానం లేదా నీకు?" అన్నాడు మాటకారి మాటలన్నీ యెప్పుడూ ఖండించే ఒక వ్యతిరేకవాది.

"ఛీ,ఛీ! అపశకునం మాటలు!" విసుక్కున్నాడు శేఖరం.

"ఓహో! స్వంత పెళ్ళికదూ!" యెవరో దీర్ఘం తీశారు.

... ... ...

పండువెన్నెల పిండారబోసినట్లుగావుంది. దొడ్లో వున్న కొబ్బరి ఆకులు వెన్నెట్లో మిలమిలలాడుతున్నాయి. హనుమంతరావుగారింట్లో పై భాగంలోవున్న వరండాలో స్తంభానాన్నానుకుని మంజులత నిలబడి వుంది. పాల నురుగులాంటి చీర వెన్నెలతో పోటీపడ్తోంది. తలలోవున్న సన్నజాజులు నిండుగా నవ్వుతున్నాయి. చందమామకేసి తదేకంగా చూస్తున్న కాటుక కళ్ళు మాత్రం యెవరికోసమో నిరీక్షిస్తున్నట్లున్నాయి, మంజులత కొందుకో క్షణం యుగంలావుంది. అలాటి యుగాలు పది గడిచిం తర్వాత శేఖరం పైకి వచ్చాడు. అతని పాదాల చప్పుడు అల్లంత దూరాన్నే పసిగట్టిన మంజులత గబగబా వెళ్ళి పిట్టగోటకా చివరగా నిలబడింది.

"మంజూ!" బలంగల రెండు చేతులు మృదువుగా తల్లో సన్నజాజుల్ని తుంపుతున్నట్లు గ్రహించిన మంజు విననపడనట్లు, తనసలు యీలోకంలో లేనట్లు వూరుకుంది.

"మంజూ! నిజంగా ఆనాడు నేను సెలవు అడగటానికి వచ్చినప్పుడు నువ్వు ఆ గదిలో వుండకపోతే నేనసలు అలా తడబడేవాడిని గాదేమో! ఆ తడబాటులోనే నన్ను నా అదృష్టదేవత వరిస్తోందని నాకేం తెలుసూ!" కన్నార్పకుండా

చందమామని తిలకిస్తున్న మంజు కనీసం 'ఊఁ' అని అయినా అనలేదు.

"మన ప్రయాణం యెంత సరదాగా గడిచింది! అది సరేగానీ, ఆ రోజు అంటే—పెళ్ళి రోజున నేను కాఫీకని నీదగ్గరకు వచ్చానే, అప్పుడలా కోప్పడ్డావేం? అప్పు డెంత బాగున్నావు! యేదీ యిటు చూడవేం?"

భుజంమీదపడ్డ చేతిని లాగేసింది మంజు.

"ఓ! కోపం వచ్చిందా యేమిటి? ఆలస్యమైనందు కేనా? మరేం చెయ్యను చెప్పు! క్రింద సూర్యం, చంద్రం వదల్లేదు. వాళ్ళు రేపు వెళ్ళిపోతున్నారు గదా! నిజంగానే సూర్యానికి, వాడి భార్యకి నేను యెంత కృతజ్ఞుణ్ణో! లేవగానే ఆ దంపతులకి చేయెత్తి నమస్కారం చేయచ్చు. అదేమిటి! నే నింతగా మాట్లాడుతూంటే, ఒక్కమాటగూడామాట్లాడటం లేదు. మూగనోము యేమయినా పట్టలేదు కదా!" మంజుని బలవంతంగా తన వైపుకు తిప్పుకుంటూ అన్నాడు శేఖర్. మంజు అప్పటికీ మాట్లాడలేదు. కొంచంసేపు ఆలోచించిన శేఖరం ప్రేమగా మంజు జుట్టుని నవరిస్తూ—

"ఆఁ! ఒక్క సంగతి చెప్పటం మర్చిపోయాను. నేను సూర్యం పెళ్ళి కెడ్తూంటే ట్రెయిన్‌లో ఒకమ్మాయి కలిసింది. తీరా నేను బెజవాడలో దిగేయబోతూంటే ఆ అమ్మాయి నన్నాపి చటుక్కున పెట్టెలోంచి ఒక వెండి సోప్ బాక్సు తీసి యిస్తూ..."

"ఆపెయ్యండి! యిక ఆపైన మాట్లాడితే ఒట్టే!" తన చేత్తో శేఖర్ నోటిని గట్టిగా మూసేస్తూ గబుక్కున అంది మంజు.

ఆ రాత్రి పడుకోబోతూ మంజు డైరీలో యిలా వ్రాసుకుంది. 'తెల్లటి బట్టల్తో, మెడచుట్టూ నల్లటి మఫ్లర్‌తో చెదరిన జుట్టుతో, అలసిన మొహంతో అందంగా నాలో చిత్రించుకుపోయిన వ్యక్తి అనుకోకుండా యిలా హఠాత్తుగా వచ్చి, నా హృదయ కవాటం తెరిచి అందులో కూర్చోగలడని అనుకోలేదు. జీవితంలో యింతకంటె ఆనందించవలసిందేముంది!' మెత్తటి సిల్కు లాల్చీలోంచి అందంగా కన్పిస్తున్న, వంపుల్తో ప్రక్కకు తిరిగి పడుకున్న శేఖరాన్ని చూచి తృప్తిగా నిట్టూర్చింది మంజులత.